మంగళవారం 4 జూలై 2023 నిర్మల్



# పరీక్షలు ఫ్రీ

- రిమ్స్‌లో రేడియాలజీ ల్యాబ్ రెడీ
- 134 రకాల వైద్య పరీక్షలు ఉచితం
- నిరుపేదలకు వేలాది రూపాయలు ఆదా
- రూ.70 లక్షలతో యంత్రాల కొనుగోలు



ఆదిలాబాద్, జూలై 3(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లావాసులకు వైద్యం అందని ద్రాక్షలా ఉండేది. స్వరాష్ట్రంతో వైద్యానికి పెట్టపీఠ వేయడంతో సేవలు మెరుగుపడ్డాయి. నూతన భవనాలు నిర్మించడం, యంత్రాలు సమకూర్చడం, అవసరమైన మందులు, సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో సర్కారు దవాఖానలకు పేషెంట్లు బారులుదీరుతున్నారు. ప్రసవాలకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటుండడంతో పీహెచ్‌సీలలో డెలివరీల సంఖ్య పెరిగింది. ప్రతినెలా 20-30 వరకు జరుగుతున్నాయి. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టీ డయాగ్నోస్టిక్ కేంద్రాల ద్వారా 134 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పీహెచ్‌సీ, యూహెచ్‌సీలకు వచ్చిన రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి టీ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపిస్తారు. పరీక్షలు నిర్వహించి ఫలితాలను వైద్యుడితోపాటు పేషెంట్ల మొబైల్స్‌కు మెస్సేజ్ చేస్తారు. వీటి ఆధారంగా వైద్యులు చికిత్స అందిస్తారు.



రేడియాలజీ హబ్‌లో మమ్మోగ్రఫీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామన్న

## రేడియాలజీ ల్యాబ్‌లో ఉచిత పరీక్షలు

ప్రమాదంలో ఎముకలు విరిగినా, ఇతర సమస్యలు వచ్చినా, గుండె సంబంధిత వ్యాధులకు చికిత్సలు అందించడానికి పరీక్షలు చేయాలి. గర్భిణులకు కూడా కడుపులో బిడ్డ ఎదుగుదల, ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా టెస్టులు నిర్వహించాలి. ఈ పరీక్షలకు ప్రైవేటు దవాఖానల్లో అయితే వేల రూపాయలు ఖర్చు అవుతాయి. ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.70 లక్షలతో రిమ్స్‌లో రేడియాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది.

## ఈసీజీ, టూ డీ ఈకో

రేడియాలజీ ల్యాబ్‌లో ఈసీజీ, టూ డీ ఈకో పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. గుండెనొప్పి, ఇతర సమస్యలు వచ్చినప్పుడు వైద్యం చేయడానికి ఈ పరీక్షలు చేస్తారు. ప్రైవేటు ల్యాబ్‌లో ఈసీజీకి రూ.300, టూ డీ ఈకో రూ.2500 తీసుకుంటారు. ఈ పరీక్షలు చేయడానికి రూ.12 లక్షల విలువ చేసే టూ డీ ఈకో మిషన్‌ను ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు.

## అల్ట్రాసౌండ్ మిషన్



గర్భిణుల్లో బిడ్డ ఎదుగుదల, ప్రసవ సమయంలో ఇబ్బందులు రాకుండా పరీక్షలు చేయాలి. వీటికి ప్రైవేటులో రూ.1200 తీసుకుంటారు. ప్రభుత్వం రూ.6 లక్షలతో అల్ట్రాసౌండ్ యంత్రాన్ని సమకూర్చింది. ఈ యంత్రం ద్వారా గర్భిణులకు పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు.



## మమ్మోగ్రఫీ పరీక్షలు

మహిళలు చాలా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. ఇందులో ప్రధానంగా బ్రెస్ట్ సమస్యలు అధికంగా వస్తుంటాయి. వీటికి చికిత్స చేయడానికి ప్రభుత్వం రూ.17 లక్షలతో యంత్రాన్ని ఏర్పాటు చేసింది. రేడియాలజీ ల్యాబ్‌లో మమ్మోగ్రఫీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రైవేటులో రూ.5 వేల వరకు తీసుకుంటుండగా.. రేడియాలజీ ల్యాబ్‌లో ఉచితంగా చేస్తారు.

## సీఆర్ ఎక్స్‌రే..

రోడ్డు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు, జారీ కింద పడినప్పుడు ఎముకలు విరగడం సహజం. వృద్ధాప్యంలో మోకాళ్ల నొప్పులు, బొక్కల సమస్యలు అధికమవుతాయి. వైద్యులు ఎక్స్‌రేలు తీయించి అవసరమైన వైద్యం అందిస్తారు. ప్రైవేటు ల్యాబ్‌లో ఎక్స్‌రేలకు రూ.400-రూ.2500 వరకు తీసుకుంటారు. రేడియాలజీ ల్యాబ్‌లో ఇప్పుడు అన్ని రకాల ఎక్స్‌రేలు ఉచితంగా తీస్తారు.



ఈసీజీ

## సేవలను వినియోగించుకోవాలి..



రిమ్స్‌లో ప్రభుత్వం రూ.70 లక్షలతో రేడియాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఈసీజీ, టూ డీ ఈకో, మమ్మోగ్రఫీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ యంత్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు. అనారోగ్యంతో బాధపడేవారు ప్రభుత్వాసుపత్రులకు వచ్చి వైద్యుల సూచనల మేరకు రేడియాలజీ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలి. రిమ్స్‌లో అన్ని రకాల వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తున్నది.

**- జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్**



చెన్నూర్ : పోడు పట్టాల పంపిణీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

- రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దే..
- ఎన్నికలప్పుడు వచ్చే వారి మాటలు నమ్మవద్దు
- దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 4 వేల పింఛన్ ఇవ్వాలి
- హక్కుల కోసం అడిగితే గుర్రాలతో తొక్కించిన చరిత్ర మీది కాదా?
- రేవంత్‌రెడ్డి చంద్రబాబు ఏజెంట్.. దొంగ
- అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మళ్లీ గెలిపించాలి
- ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్
- చెన్నూర్‌లో ఎంపీ వెంకటేశ్ నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మితో కలిసి పోడు పట్టాలు పంపిణీ

# గిరిజనులకు స్వర్ణయుగం

## సీఎం కేసీఆర్ పాలనలోనే అడవిబిడ్డలకు న్యాయం



పోడు పట్టా అందుకున్న ఆనందంలో రైతులు

చెన్నూర్, జూలై 3 : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన గిరిజనులకు ఒక స్వర్ణయుగమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని 666 మంది గిరిజనులకు 1,190 ఎకరాలకు సంబంధించిన పోడు పట్టాలను పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడవిబిడ్డల అస్తిత్వాన్ని గుర్తించి, వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ న్యాయం చేస్తున్నదని, వారిపై ప్రేమను, చిత్తశుద్ధిని చాటుకుంటుందన్నారు. గిరిజనులకు విద్య, ఉద్యోగావకాశాలను పెంచేందుకు రిజర్వేషన్ శాతాన్ని పదికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పేరిట విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే పేద గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం రూ. 20 లక్షల సాయం అందజేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 500 జనాభా దాటిన 2,471 గిరిజన తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపామని.. బంజారాలు, ఆదివాసుల కోసం హైదరాబాద్‌లో రూ. 50 కోట్లతో సంత్ సేవాలాల్ బంజారా భవన్, కుమ్రం భీం ఆదివాసీ భవనాన్ని నిర్మించినట్లు చెప్పుకొచ్చారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ గిరిజన సంక్షేమానికి రూ.53 వేల కోట్లు ఖర్చు చేశారని, గిరిజన గ్రామాల్లో రూ.248.20 కోట్లతో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించారని తెలిపారు. రూ 1,275.87 కోట్లతో 1,682 గిరిజన ఆవాసాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.121.80 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 58 గిరిజన భవనాలు నిర్మించిందన్నారు. 8,467 గిరిజన ప్రాంతాలకు రూ.221 కోట్లతో వ్యవసాయ విద్యుత్ సౌకర్యం కల్పించిందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పింఛన్ ఇవ్వడానికి అష్టకష్టాలు పడుతున్న హస్తం పార్టీ.. తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. 4 వేల పింఛన్ ఇస్తామంటే నమ్మేవారు లేరని ఎద్దేవా చేశారు. దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మొదట రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనులు హక్కుల కోసం అడిగితే గుర్రాలతో తొక్కించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు పోడు పట్టాలు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబు ఏజెంట్ అని, తెలంగాణ ఉద్యమ సమయంలో చంద్రబాబు పక్కన ఉన్న దొంగ అని మండిపడ్డారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే అక్కడ కేసీఆర్, ఇక్కడ తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇంకా పోడు పట్టాలు రాని వారు ఉంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



చెన్నూర్ : పోడు రైతుకు పట్టాను అందజేస్తున్న విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేశ్ నేతకాని

## గిరిజన సంక్షేమమే ధ్యేయం

**- ఎంపీ వెంకటేశ్ నేతకాని**

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేకాని పేర్కొన్నారు. గిరిజనులు దశాబ్దాలుగా తమ హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసినా.. అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయేలా గిరిజనులకు పోడు పట్టాలిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన రైతులు



పోడు పట్టాల పాసు బుక్కులతో మహిళా రైతులు



జైనూర్ : పోడు భూమి పట్టాలను అందజేస్తున్న ఆసిఫాబాద్ జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి

# భీం స్ఫూర్తితోనే పోడు పట్టాల పంపిణీ

## గిరిజనుల దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే..

- జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- పలుచోట్ల ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెలతో కలిసి పంపిణీ
- రెబ్బెనలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



వాంకిడి : పోడుభూముల పట్టాల కోసం వచ్చిన రైతులు



ఆసిఫాబాద్ టౌన్ : పట్టా పాస్‌బుక్కు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వర్ రావు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/వాంకిడి, జూలై 3 : కుమ్రం భీం స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్‌తో కలిసి ఆమె గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 1,035 మందికి పోడు పట్టాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. సర్పంచ్ బండే తుకారాం, ఎంపీడీవో వేంకటేశ్వర్ రెడ్డి, ఏవో మిలింద్ కుమార్, పీఏఎంసీ చైర్మన్ జాబోరే పెంటు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, నాయకులు దీపక్, డీవీఎంసీ మెంబర్ ఎం.అశోక్ ఉన్నారు.

కెరమెరి, జూలై 3 : పోడు భూములు సాగు చేస్తున్న రైతులందరికీ పట్టాలిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో1,204 మంది రైతులకు పోడు భూముల పట్టాలు అందించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న గిరిజన రైతుల కలను సీఎం కేసీఆర్ సాకారం చేశారన్నారు. పట్టాలు ఇవ్వడమేగాకుండా రైతుబంధు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వర్, సూపరింటెండెంట్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణప్రసాద్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు కేంద్రే బాలాజీ, ఎంపీటీసీ ఇప్తేకర్, సిడాం భీంబాయి, సర్పంచులతో పాటు నాయకులు మడవి రఘునాథ్, దందురావ్, భీంరావ్, బొజ్జీరావ్, రైతులు పాల్గొన్నారు.

జైనూర్, జూలై 3 : జైనూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో 892 మంది గిరిజన రైతులకు జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమ్రం భీం పోరు గడ్డ ఆసిఫాబాద్ నుంచే పోడు పట్టాల పంపిణీ ప్రారంభించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. నాడు ఇంద్రవెల్లి అమరుల స్తూపం వద్ద నివాళులర్పించేందుకు వెళ్లిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీచార్జి ఘటనను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని, ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనకయాదవరావు, ఎంపీపీ కుంర తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ చీర్లె లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ హన్నుపటేల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, మడావి భీంరావ్, మెస్రం రాహుల్, ఎంపీటీసీలు కుంర భగవంత్‌రావ్, ఆత్రం జుగాదిరావ్, నాయకులు మెస్రం అంబాజీరావ్ ఉన్నారు.

ఆసిఫాబాద్ టౌన్, జూలై 3 : జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్ రావుతో కలిసి పోడు రైతులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, ఎంపీవో ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ ఉన్నారు.

రెబ్బెన, జూలై 3 : పోడు పట్టాల పంపిణీ సందర్భంగా రెబ్బెన మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సంతోశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



రెబ్బెన : సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సంతోశ్, పోడు రైతులు